REGD No. H 18 విడిప్రతి 0-25 పై. 2-12-66 శుక్రవారం

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 48

## శేషయ్య దీక్షావిరమణ

ఉక్కుఫ్యాక్టరీకోసం నవంబరు 1 తేదినుండి నిరాహారదీక్ష సాగిస్తున్న శ్రీ పత్తి శేషయ్య డిసెంబరు 1 తేది విరమించారు. తాను ఇంకా దీక్ష కొనసాగించినా, మరణించినా రాష్ట్రంలో విప్లవం వస్తుందని, ఆ పరిస్థితి కలుగకుండా తాను విరమించుకుంటున్నానని ప్రకటించారు. ఎంత మంచి పనిజేశాడు శ్రీ శేషయ్య!

# ఢిల్లీలో ఆంధ్ర కాంగ్రెస్ భిన్నవర్గాల మోహరింపు

★ సంజీవరెడ్డిగారిని రాష్ట్రనాయకత్వానికి తీసుకరావాలని- ఉక్కు ఆందోళన ఆంధ్రప్రభుత్వంపట్ల కల్గించిన వ్యతిరేకత నుండి పూర్తి ప్రయోజనం పొందాలని సయోధ్యులు-

★★ ప్రదేశ్ కాంగ్రెస్‌పట్టికను యథాతథంగా ఆమోదింపజేయాలనీ బ్రహ్మానందరెడ్డి నాయకత్వానికి వ్యతిరేకంగా సయోధ్యుల ఎత్తుగడలను సాగనీయకుండాచేయాలనీ అయోధ్యులు-

( మా హైదరాబాదు విలేఖరి )

విశాఖపట్టణం ఉక్కు కర్మాగారంపై జరిగిన ఆందోళనవల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపట్ల ఢిల్లీలో కలిగిన వ్యతిరేక అభిప్రాయం పూర్తి ప్రయోజనాన్ని పొందే ప్రయత్నంలో రాష్ట్ర కాంగ్రెస్ తిరుగుబాటు వర్గమున్నదని వేరే చెప్పనక్కరలేదు.

ఢిల్లీలో మకాంపెట్టిన పిడితల రంగారెడ్డి ప్రభృతులు ఆంధ్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని సంజీవరెడ్డిగారు తిరిగి చేపట్టేటందుకు తగు వాతావరణాన్ని కల్పిస్తున్నారు. వీరికృషి ప్రగతి చెందిందనడానికి "హిందూ" ఢిల్లీ ప్రత్యేక విలేఖరి కె. రంగస్వామిగారు, తమపత్రిక నవంబరు 28 నాటి సంచికకు పంపిన వార్తే తార్కాణం. ఆయన కథనం ప్రకారం, పలువురు ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు హైదరాబాదు తిరిగి రావలసిందిగా సంజీవరెడ్డిగారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఒక వారంతరువాత సంజీవరెడ్డిగారి నిర్ణయమేదిటో తెలిసిపోతుంది. సంజీవరెడ్డిగారు హైదరాబాదు వచ్చేసేట్టయితే బ్రహ్మానందరెడ్డిగారిని ఏదో ఒక లోక్‌సభ సీటుకు పోటీచేయుమని కాంగ్రెస్ అధ్యక్షుడు కోరగలరని యిక్కడి తిరుగుబాటు వర్గాల ద్వారా తెలుస్తున్నది. మంగళవారంనాడు బ్రహ్మానందరెడ్డిగారు కామరాజ్‌గారిని కలుసుకునేటందుకు మద్రాసు వెళ్లడం యిందుకేనని, అసలు యిలాంటి సలహా నివ్వడానికే మద్రాసులో తనను కలుసుకొనమని బ్రహ్మానందరెడ్డిగారిని పిలిపించారనీ అంటున్నారు.

బ్రహ్మానందరెడ్డిగారుమాత్రం ఇందులో ఈషణ్మాత్రం నిజంలేదనీ, ఎసెంబ్లీకో, లోక్‌సభకో పోటీచేసేనిర్ణయం తనదేనని, భవిష్యత్తులో రాష్ట్రనాయకత్వం యెవరు వహించవలసింది ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తారనీ విలేఖరులకుచెప్పారు. ప్రదేశ్ ఎన్నికలసంఘం సిఫార్సుచేసిన అభ్యర్థుల పట్టికను యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘంచేత ఆమోదింపచేసేటందుకు, బ్రహ్మానందరెడ్డిగారి నాయకత్వానికి వ్యతిరేకంగా ఎదుటివర్గంవారి ఎత్తుగడలు కొనసాగకుండావుండేటందుకూ తిమ్మారెడ్డిగారు, వల్లూరి బసవరాజుగారు, డాక్టరు ఎం. చెన్నారెడ్డిగారు క్రితంవారమే ఢిల్లీ వెళ్లి మకాంపెట్టారు. వీరుకాక బ్రహ్మానందరెడ్డివర్గానికిచెందిన పదిమంది జిల్లాపరిషత్తుఅధ్యక్షులు, జిల్లాకాంగ్రెస్ సంఘాధ్యక్షులు ఢిల్లీ వెళుతున్నారు. విమానంసీట్లకు 40 దాక వెయిటింగ్‌లిస్టువుంది. ప్రతిరోజు గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా ఒక బోగిని రైల్వేఅధికార్లు వేస్తున్నారు. ఐనా డిశంబరు 15 వరకు కొత్త రిజర్వేషను ఎవరికీ లభించేసూచనలేదు. తిరుగుబాటు వర్గంవారుకూడా ఢిల్లీప్రయాణం కట్టారు. 'పి. సి.' మంగళవారంనాడే ఢిల్లీ చేరుకున్నారు. పి. వి. జి, జలగం వెంగళరావు ప్రభృతులుకూడా వెళ్తున్నారు.

క్రితం సార్వజనిక ఎన్నికల్లో రాష్ట్ర ఎసెంబ్లీకి పోటీచేసి ముఖ్యమంత్రిపదవిని మళ్లీ అలంకరించాలనే తమ కోరికను అప్పటి కాంగ్రెస్‌అధ్యక్షుడు సంజీవరెడ్డిగారు ప్రకటించుకుంటే, శ్రీ నెహ్రూగాని, లాల్‌బహాదూర్‌శాస్త్రిగాని వద్దనలేదు. అలాగే ఈసారి మళ్లీ అదే అభిలాష సంజీవరెడ్డిగారికుంటే కామరాజ్‌గాని, ఇందిరాగాంధీగాని కాదనకపోవచ్చును. బ్రహ్మానందరెడ్డిగారుకూడా రాష్ట్రఎసెంబ్లీకే పోటీచేస్తానంటే కాదనరు. కాని వీరుభయుల కలతలకారణంగా కాంగ్రెసుకు ఎన్నికల్లో నష్టం వాటిల్లకుండా తగుశ్రద్ధ తీసుకోవాలని కామరాజ్ భావిస్తున్నట్లు తెలుస్తున్నది. మద్రాసులో కామరాజ్, బ్రహ్మానందరెడ్డిమధ్య జరిగేచర్చల్లో ఈవిషయం ప్రస్తావించబడవచ్చును. ఏమైనా మళ్లీ అనిశ్చిత వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ సుశిక్షితసైనికులమని ఈ నాయకులిద్దరూ చెప్పవచ్చును. కాని కాంగ్రెసంతా రాష్ట్రం సలుమూలలా రెండుగా చీలిపోయినప్పుడు, ఏకవర్గాన్ని అగ్రనాయకులు అనుకూలించినా, రెండవవర్గం వ్యతిరేకంగా పనిచేస్తుందని వేరేచెప్పనక్కరలేదు. ఉభయవర్గాలు వేర్వేరుగాపంపిన అభ్యర్థులపట్టికల్లో ఎదుటివర్గం ప్రముఖులందరి





# మళ్లీ అనిశ్చిత వాతావరణం

మీద ఘోరమైన ఆరోపణలుచేశారు. ఈ ఆరోపణలపట్టికలు బయటపడితే ప్రముఖ కాంగ్రెస్‌వాదులుగా చలామణి అవుతున్న ఒక్కరినికూడా ప్రజలు ఎన్నుకోకపోవచ్చును.

కాంగ్రెస్ అదృష్టవశాత్తు, ఉభయ కమ్యూనిస్టుపార్టీలమధ్య ఆరుమాసాలుగా జరుగుతున్న ఎన్నికల ఒప్పందానికి సంబంధించిన చర్చలు పూర్తిగా విఫలమయ్యాయి. ఉభయులుకూడా తమ అభ్యర్థుల పట్టికలను, పోటీచేయదలచిన నియోజకవర్గాల పేర్లను స్వతంత్రంగా ప్రకటించివేస్తున్నారు. రైటిస్టు కమ్యూనిస్టులు ఎనభైకి పైగా స్థానాలకు పోటీచేస్తున్నారు. మార్క్సిస్టుపార్టీ ప్రకటించిన 70 స్థానాల్లో 10 కి ఇత్పుడు రైటిస్టు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరి పది పది హేనుస్థానాల్లోకూడా రెండువర్గాల అభ్యర్థుల పోటీతప్పదు. కమ్యూనిస్టులందరికి ప్రస్తుతం 55 స్థానాలు రాష్ట్రశాసనసభలో వున్నాయి. ఈ పరస్పరదూషణ, పోటీల కారణంగా వీరందరికీ కలిపి 40 స్థానాలు వస్తే అధికమనుకోవాలి. తమకు ప్రస్తుతం మెజారిటీ స్థానాలున్నాయికనుక ఆ ప్రాతిపదికపైనే సీట్లపంపకం జరగాలని రైటిస్టులు కోరారు. మీకు ప్రజల్లో బలం మాకంటే తక్కువకనుక మాకే అధికం సీట్లు రావాలని మార్క్సిస్టులు పట్టుబట్టుతున్నారు. ఏమైనా "రివిజనిస్టుల"ను హతమార్చడమే మార్క్సిస్టులు తమ ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నారనడంలో సందేహంలేదు. దీని ప్రయోజనాన్ని పొందలేక

—కొరవ 12వ పేజీలో

పార్లీస్ డ్రింక్స్




నెల్లూరు టౌన్లోను,
ఇతర టౌన్లలోను
డీలర్సుకావాలి
వివరాలకు:-
విజయ్ ఎంటర్ ప్రైజెస్
(కో-ఆపరేటివ్ బ్యాంకు ఎదురు)
ట్రంకురోడ్డు—నెల్లూరు



1-12-67

తృతీయ వార్షికోత్సవ
సందర్భమున
మా అభిమానులకు
హృదయపూర్వక
అభివందనములు
తెలియజేస్తున్నాము.

సుందర మహల్
పడుగుపాడు - నెల్లూరుజిల్లా.
టెలిఫోన్ :: కోవూరు 42.

